సాక్షి
కుమురం భీం
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



గోదారమ్మ చెంతకు..
అడెల్లిలోని మహాపోచమ్మ గంగనీళ్ల జాతర శని వారం ఘనంగా ప్రారంభమైంది. గోదావరి చెంతకు అమ్మవారి ఆభరణాలను భక్తులు కాలినడకన తరలించడంతో జాతర మొదలైంది. 8లో▸



అసౌకర్యాల సంత
వాంకిడి మండల కేంద్రంలోని చిక్లీ వాగు తీరంలో ప్రతీ గురువారం నిర్వహించే వారసంత అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.2 /24.2

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

తెగని పంచాయితీ?


ఉట్నూర్‌లో ఆదివాసీ, ముస్లిం నేతలతో శాంతిచర్చలు జరుపుతున్న శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్, కలెక్టర్ వెంకటేశ్‌దోత్రే, తదితరులు (ఫైల్)

- నసేమిరా అన్న ఇరువర్గాలు
- షాపుల మరమ్మతులకు ఒప్పుకోని ఆదివాసీలు
- ఎల్టీఆర్ చట్టం అమలుకు పట్టు
- ట్రేడ్ లైసెన్సులు మాకే ఇవ్వాలని డిమాండ్
- కలెక్టర్, ఎస్పీ సమక్షంలో విఫలమైన చర్చలు
- జైనూరులో కొనసాగుతున్న 144 సెక్షన్

సాక్షి, ఆసిఫాబాద్: నెల రోజుల క్రితం ఆదివాసీ మహిళపై జరిగిన ఘటనతో అట్టుడికిన జైనూరులో మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కలెక్టర్, ఎస్పీ చేసిన ప్రయత్నం విఫలమైంది. శనివారం తన ఛాంబర్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి ఇరువర్గాల నాయకులతో వేర్వేరుగా చర్చలు జరిపారు. నెల రోజులుగా జైనూరులో 144 సెక్షన్ పెట్టడం వల్ల సాధారణ జనాలు ఇక్కట్లు పడుతున్నారు. ఇంటర్నెట్‌పై బ్యాన్ పెట్టడంతో బ్యాంకింగ్, మీసేవ వంటి సేవలు నిలిచిపోయాయి. దుకాణాలు తెరుచుకోకపోవడంతో నిత్యావసరాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అందరూ కలిసిపోయి ప్రశాంతంగా ఉంటామని హామీ ఇస్తే.. 144 సెక్షన్ ఎత్తివేస్తామని పేర్కొనగా అందుకు ఆదివాసీలు నసేమిరా అన్నట్లు తెలిసింది. మరోవర్గం నాయకులు ధ్వంసమైన తమ షాపులకు మరమ్మతులు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా.. అందుకు తాము ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమని, జైనూరులో ఎల్టీఆర్ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఆదివాసీలు పట్టుబట్టినట్లు సమాచారం. అయితే సమస్య పరిష్కారానికి ఏ వర్గం సుముఖత చూపకపోవడంతో చర్చలు అర్థాంతరంగా ముగిసినట్లు తెలుస్తోంది. కలెక్టర్, ఎస్పీల సమక్షంలో జరిగిన చర్చల్లో ఇరువర్గాల డిమాండ్లు ఇలా ఉన్నాయి.

వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం కల్పించండి...
ఆదివాసీలు జరిపిన దాడుల్లో ధ్వంసమైన దుకాణాలు మరమ్మతు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ముస్లిం నాయకులు కలెక్టర్, ఎస్పీకి విన్నవించారు. ట్రేడ్ లైసెన్సులు ఇప్పిస్తే..తమ వ్యాపారాలు కొనసాగిస్తామని, అందుకు అవకాశం కల్పించాలని కోరారు. మాకు ఆదివాసీలతో ఎలాంటి సమస్యలు లేవని, మాపై జరిగిన దాడుల్లో మరో వర్గం హస్తం ఉందని కొందరు నేతలు ఆరోపించినట్లు తెలిసింది.

ఆదివాసీ చట్టాలు అమలు చేయాల్సిందే...
గిరిజనుల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పెసా, 1/70 చట్టాలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఆదివాసీలు డిమాండ్ చేశారు. ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్(ఎల్టీఆర్) చట్టం అమలు చేసి నిబంధనలకు విరుద్ధంగా గిరిజనుల భూములను దక్కించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉట్నూరు ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలోని ఏజెన్సీ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఎల్టీఆర్ కేసులన్నింటినీ ఒకే రోజులో పరిష్కరించాలన్నారు. ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడిచి జైనూరులో ఆదివాసేతరులు నిర్మించుకున్న ఇళ్లను, దుకాణాలను తొలగించాలని పట్టుబట్టారు. దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు గిరిజనేతరులకు ఇవ్వరాదని.. వాటిని తమకే ఇవ్వాలని కోరారు. తమ వర్గానికి చెందిన వారే ఇకపై ఇక్కడ వ్యాపారాలు నిర్వహించుకుంటామని.. అందుకోసం ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని తెలిపారు. ప్రైవేటు స్కూళ్లను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ధ్వంసమైన భవనాలను మరమ్మత్తుకు అంగీకరించమని ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం.

దసరా తర్వాత పాఠశాలలు ప్రారంభం..
దసరా పండుగ తర్వాత పాఠశాలలు యథావిధిగా ప్రారంభిస్తామని కలెక్టర్ స్పష్టం చేయగా.. అందుకు ఆదివాసీ సంఘ నేతలు అంగీకరించబోమనడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పిల్లల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దని, విద్యా సంవత్సరం మధ్యలో స్కూళ్ల మూసివేతకు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇక ఆదివాసీలు వ్యాపారాలు నిర్వహించుకోవడానికి వీలుగా జిల్లా అధికారులను సమావేశపరిచి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. బ్యాంకులను సంప్రదించి రుణాల మంజూరుకు యత్నిస్తామన్నారు. అయితే ఆదివాసీలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో గిరిజనేతరులను జైనూరులో అడుగుపెట్టనీయమనే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. చర్చలు సఫలం కాకపోవడంతో జైనూరులో 144 సెక్షన్ కొనసాగిస్తామని ఎస్పీ పేర్కొన్నట్లు తెలిసింది.

న్యూస్‌రీల్

'కాకా'కు ఘననివాళి


నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో శనివారం కేంద్ర మాజీమంత్రి, ఎంపీ గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డివి శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా వెంటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏడు సార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా ప్రజలకు సేవలందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో
ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో వెంకటస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు రాణాప్రతాప్, పెద్దయ్య, అంజన్న, మార్కండేయ, హరినాథ్, కేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ కార్డు సర్వే తనిఖీ


పరిశీలిస్తున్న అదనపు కలెక్టరు దీపక్ తివారి

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్‌లో నిర్వహిస్తున్న డిజిటల్ కార్డు సర్వేను శనివారం అదనపు కలెక్టరు దీపక్ తివారి తనిఖీ చేశారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రతిఒక్కరూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

సిర్పూర్(టి): వన్యప్రాణుల సంరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని అటవీశాఖ డిప్యూటి రేంజ్ అధికారి శ్రీధర్ చారి అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని అటవీశాఖ రేంజ్ అధికారి కార్యాలయం నుండి బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు, అడవుల సంరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం వన్యప్రాణులు, అడవుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

7న లాభాల వాటా పంపిణీ

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు ఈ నెల 7న లాభాల వాటా పంపిణీ చేస్తారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులకు కంపెనీ సాధించిన లాభాల నుంచి 33శాతం వాటా చెల్లించనుందని పేర్కొన్నారు. డబ్బులు కార్మికుల బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. లాభాల్లో కార్మికుల హాజరుపై 85శాతం కింద రూ.679.03 కోట్లు, గ్రూప్ ఫర్ఫార్మెన్స్‌పై 14శాతంగా రూ.111.45 లక్షలు, ఇన్సెంటీవ్‌పై ఒక శాతం రూ.5.57 కోట్లు కేటాయించి చెల్లిస్తారని తెలిపారు. భూగర్భంలో పని చేసే కార్మికులకు రోజుకు రూ.771.11, సర్ఫేస్‌లో రూ.610.46, డిపార్టుమెంట్లలో పని చేసే వారికి రూ.563.50 చొప్పున లెక్కించి చెల్లిస్తారని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేస్తున్న డెయిలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు శనివారం డీటీడీవో రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేందర్, దినకర్, కార్తీక్, కోటయ్య, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

'డిజిటల్' సర్వే నివేదిక స్పష్టంగా ఉండాలి

- జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఇలంబరిది


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఇలంబరిది

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నివేదిక స్పష్టంగా ఉండాలని ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ కె.ఇలంబరిది అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సర్వే నిర్వహణపై ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, బృందాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ నెల 9న వివరాలు పరిశీలించి, నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపరచి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒకే కార్డు ఉంటుందని, ప్రతి సభ్యుడికి ఒక ప్రత్యేక నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పైలెట్ ప్రాజెక్టు సర్వేపై ప్రజలకు తెలిసే విధంగా టాం టాం, ప్రచార సాధనాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా అవగాహన కల్పించాలన్నారు.

గడువులోగా పూర్తి చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: నిర్ణీత గడువులోగా ఎల్ఆర్ఎస్ సర్వే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని ఎన్‌జీ వో కాలనీలో నిర్వహించిన సర్వేలో పాల్గొని ప లు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ క్రమబద్ధీకరణకోసం అందిన ప్రతీ దరఖాస్తు రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో భౌగోళిక పరిస్థితిని పరిశీలించాలన్నా రు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధి కారి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' గ్రామసభలు


వాంకిడి గ్రామ పంచాయతీలో ఈ నెల 2న నిర్వహించిన గ్రామసభ

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు
- ప్రజలు ఆమోదించిన పనులకే తీర్మానాలు

తిర్యాణి: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా ప్రతీ కుటుంబానికి ఏడాదికి వందరోజుల పనిదినాలు కల్పిస్తూ కష్టకాలంలో వారికి ఆర్థికంగా భరోసా కల్పిస్తోంది. అంతేకాకుండా పథకంలో భాగంగా ఎక్కువగా వ్యవసాయ అనుబంధ పనులైన కుంటల నిర్మాణం, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు ఖరారు చేసేందుకు ఈజీఎస్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. చేపట్టాల్సిన పనులను క్షేత్రస్థాయిలో గుర్తిస్తున్నారు. అయితే అన్ని పంచాయతీల్లో రెండు దఫాల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. మొదటి గ్రామసభలో ఉపాధిహామీ పథకం కిందకు వచ్చే 266 పనులకు సంబంధించిన వివరాలను ప్రజలకు చదివి వినిపిస్తున్నారు. ఈ క్రమంలో రెండో గ్రామసభ నిర్వహించే లోపు రైతులకు అవసరమయ్యే పనులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారు. వాటిపై చర్చించి ప్రజల అభిప్రాయం మేరకు తీర్మానాలు చేస్తారు. ఇందులో భాగంగా ఈనెల 2న మహాత్మాగాంధీ జయంతి రోజు నుంచి ఆయా పంచాయతీల్లో మొదటి గ్రామసభలు నిర్వహించారు. మరో వారం రోజుల తర్వాత రెండో గ్రామసభలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

జిల్లా వివరాలు

జాబ్ జార్డులు	1.23 లక్షలు
ఉపాధిహామీ కూలీల సంఖ్య	2.47 లక్షలు

నవంబర్ 30 వరకు గ్రామసభలు
జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఉపాధిహామి పనులను గుర్తించేందుకు జిల్లాలో నవంబర్ 30 వరకు రెండో విడత గ్రామసభలు నిర్వహించనున్నారు. అనంతరం గ్రామసభల్లో చేసిన తీర్మాణాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తారు. గ్రామస్థాయిలో తీర్మానించిన పనులను మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు పంపించనున్నారు. 2025 మార్చి 31 వరకు ఆమోదించిన పనులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో అంటే ఏప్రిల్ 1 నుంచి చేపడుతారు. గ్రామాల్లో ఉపాధి సిబ్బంది, రైతులు, గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారితో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. సీజన్ల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి చర్చించిన తర్వాత పంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానిస్తారు.

ప్రజాభీష్టం మేరకే...
ఉపాధి హామి పథకంలో భాగంగా గతంలో కూలీలు, ప్రజల భాగస్వామ్యం లేకుండానే ఇష్టానుసారంగా ఉపాధి పనులు చేపట్టేవారు. తద్వారా సామాజిక తనిఖీ చేపట్టిన సమయంలో భారీగా అక్రమాలు వెలుగులోకి వస్తుండడంతో ప్రభుత్వం పారదర్శకత కోసం చేపడుతున్న చర్యల్లో భాగంగా ప్రజలు ఆమోదించి గ్రామసభలు తీర్మానించిన పనులనే చేపట్టాలని నిర్ణయించింది. దీంతోపాటు ఇష్టారీతిన పనులు చేపట్టకుండా పరిమితిని సైతం విధించింది. ప్రస్తుతం పంచాయతీ 20 మించి పనులు నిర్వహించే అవకాశం లేదు. ఆ పనులు పూర్తయిన తర్వాతే మిగిలిన పనులు చేపట్టే ఆస్కారం ఉంటుంది. దీనిద్వారా అసంపూర్తిగా పనులు చేపట్టి నిధులు పక్కదారి పట్టించే అవకాశం ఉండదు. అంతేకాక వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు 15 రకాల పనులు చేపట్టున్నారు. ఇందులో ముఖ్యంగా ఫారంపాండ్, కాలువల పూడిక తీతలు, కుంటల తవ్వకం, చేపల చెరువులు, పంటపొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం, మొక్కల పెంపకంలాంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

గ్రామసభలు నిర్వహిస్తున్నాం
ఉపాధి హామి పథకంలో పారదర్శకత, స్థానిక అవసరాల దృష్ట్యా ఉపాధి కూలీల భాగస్వామ్యంతో పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేస్తున్నాం. మండలాల వారీగా సేకరించిన వివరాలను క్రోడీకరించి నివేదికలు రూపొందిస్తాం. కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.
– దత్తారావు, డీఆర్‌డీవో, ఆసిఫాబాద్

ముదురుతున్న వివాదం


కార్యాలయం ఎదుట నిలిపిన లారీలు (ఫైల్)

- ఆందోళన బాటలో లారీ యజమానులు
- మెట్టు దిగని పేపర్ మిల్లు యాజమాన్యం

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్‌మిల్లు యాజమాన్యానికి, లారీ యజమానులకు మధ్య వివాదం ముదురుతోంది. వారం రోజులుగా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాజమాన్యం కిరాయిలు పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మె బాట పట్టే ప్రయత్నంలో భాగంగా ముందుకెళ్తున్నారు. నాలుగు రోజుల క్రితం మిల్లులో పే పర్ లోడ్ చేసుకున్న పలు లారీలను తీసుకువచ్చి గమ్యస్థానానికి వెళ్లకుండా అసోసియేషన్ కార్యాల యం ఎదుట నిలిపివేశారు. లక్షల రూపాయల పేపర్ లోడ్ కలిగిన లారీలను నిలిపివేయడంతో పేపర్‌కోసం ఆర్డర్ పెట్టుకున్న యజమానులు ఇబ్బందులకు గురికాకతప్పడంలేదు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఒకవైపు లారీ సంఘం ఆధ్వర్యంలో యజమానులు, డ్రైవర్లు ముందుకెళ్తుండగా మరోవైపు పేపర్ మిల్లు యాజమాన్యం స్పందించకపోవడంతో వివాదం ముదిరే అవకాశం కనిపిస్తోంది. పేపర్ లోడు కలిగిన లారీలు అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిలిపివేయడంతో యాజమాన్యం దీన్ని తప్పుగా పరిగణిస్తోంది. చర్చల ద్వారా సమస్య పరిష్కరించాలని పలువురు యజమానులు, డ్రైవర్లు కోరుతున్నప్పటికీ, మిల్లు యాజమాన్యం నుంచి ఎలాంటి ఆహ్వానం రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి నెలకొంది.

అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం
ఈ నెల 5 నుంచి బయట నుంచి వచ్చే లారీలను కూడా కాగజ్‌నగర్ పట్టణంలోనికి రానివ్వకుండా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని సంఘం అధ్యక్షుడు కిషోర్ బాబు ప్రకటించడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. గతంలో కూడా పేపర్‌మిల్లు యాజమాన్యానికి, లారీ యజ మానులకు మధ్య వివాదం ముదిరి అధికాస్తా హింసాత్మకంగా మారడం, లారీలను దగ్ధం చేయడంలాంటి సంఘటనలు జరిగిన విషయం తెలిసిందే. లారీ చక్రాలను రోడ్డుపై వేసి నిప్పు పెట్టి తీవ్రస్థాయిలో నిరసన తెలిపిన విషయం విదితమే. ఈనేపథ్యంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అటు పేపర్‌మిల్లులో, ఇటు లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం లారీ యజమానుల సంఘం ప్రతినిధులు కలెక్టర్ వెంకటేశ్ దోత్రెతో పాటు ఎస్పీ శ్రీనివాస్‌రావును కలిసి విషయాన్ని వివరించారు.

కోలిండియా పోటీల్లో సత్తా చాటాలి


హాకీ పోటీలను ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: సింగరేణిలో పనిచేస్తున్న క్రీడాకారులు కోలిండియా పోటీల్లో సత్తా చాటాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం గోలేటిలోని భీమన్న స్టేడియంలో డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా నిర్వహించిన హాకీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు క్రీడల్లోనూ రాణించేందుకు యాజమాన్యం అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఏటా డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహారా, సివిల్ ఎస్ఈ మదీనా బాషా, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న డీఆర్‌డీవో దత్తారావు

దహెగాం: ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. మార్చి 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలో జరిగిన 9.43 కోట్ల పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీలు నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 14వవిడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 24 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై తనిఖీ బృందం సభ్యులు నివేదికలు చదివి వినిపించారు. పనులకు వెళ్లని వారికి వేతనాలు చెల్లించడం, రికార్డులు సరిగా లేక పోవడం, మొక్కలు చనిపోవడం, తదితర అవకతవకలకు పాల్పడ్డ వారికి 18 షోకాజ్ నోటీసులు జారీచేసి రూ.4.20 లక్షల రికవరీ, 45 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో క్రిష్ణమూర్తి, ఎస్ఆర్‌పీ ప్రదీప్, సామాజిక తనిఖీ అంబుడ్స్ అధికారి సాయిశ్రీ, క్వ్యాసీ రమేశ్, ఏపీవో కల్పన, తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అన్నపూర్ణదేవిగా దుర్గామాత


అన్నపూర్ణదేవి అలంకరణలో దుర్గామాత

రెబ్బెన(ఆసిఫాబాద్): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గామాత అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గుహలోని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ట్రిపుల్ఐటీపై విచారణ చేపట్టండి'



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఓయూ జేఏసీ నేతలు

భైంసా: బాసర ట్రిపుల్ఐటీలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతూ ఓయూ జేఏసీ నేతలు శనివారం హైదరాబాద్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్గా బాసర ట్రిపుల్ఐటీ ఇన్చార్జి వీసీగా జోడు పదవుల్లో కొనసాగుతూ అనేక అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్ వెంకటరమణను వెంటనే తొలగించాలని డిమాండ్చేశారు. ఇన్చార్జి వీసీ నకిలీ బిల్లులు సృష్టించి డబ్బులు కాజేశారని ఇందుకు సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగులను వేధిస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అన్నారు. కాలం ముగిసిన టెండర్లు వేయకుండా పర్సంటేజీలు తీసుకుంటూ పాత వారినే కొనసాగిస్తున్న వైనంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సర్దార్ వినోద్కుమార్, పేరాల ప్రశాంత్, రంజిత్కుమార్, ప్రవీణ్, దిలీప్, శేఖర్యాదవ్, వికాస్యాదవ్ ఉన్నారు.

ముఖరా(కే)ను ఆదర్శంగా తీసుకోవాలి



మీనాక్షికి మెమొంటో అందజేస్తున్న అనితారామచంద్రన్

ఇచ్చోడ: రాష్ట్రంలోని ఆయా పంచాయతీలు ముఖ రా(కే)ను ఆదర్శంగా తీసుకొని ప్రగతి బాటలో నడవాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. హైదరాబాద్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మీ నాక్షి, ఎంపీటీసీ సుభాష్ను అభినందించి మెమొంటోలు అందజేశారు. చెత్త ద్వారా ఆదాయం, సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి, ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకొని ముఖరా(కే) జీపీ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇందులో స్టేట్ ఫైనాన్స్ కమిషనర్ సిరిసిల్ల రాజయ్య, సెర్ప్ కార్యదర్శి దివ్యదేవరాజన్, ఫైనాన్స్ కార్యదర్శి స్మితా సబర్వాల్ పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

కాగజ్నగర్రూరల్: పట్టణంలోని నౌగాంబస్తీలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై పట్టణ పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,070 నగదు తోపాటు ఐదు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పేకాటఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

గోదారమ్మ చెంతకు..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పోలీసు బందోబస్తు మధ్య అమ్మవారి ఆభరణాల వెంట వెళ్తున్న భక్తులు

- అడెల్లి పోచమ్మ ఆభరణాలు
- కాలినడకన తరలిన భక్తులు
- ప్రారంభమైన గంగనీళ్ల మహా జాతర
- నేడు అమ్మవారికి ఆభరణాల అలంకరణ

సారంగాపూర్: అడెల్లిలోని మహాపోచమ్మ గంగనీళ్ల జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. దిలావర్పూర్ మండలం సాంగ్వీ సమీపంలోని గోదావరి చెంతకు అమ్మవారి ఆభరణాలను భక్తులు కాలినడకన తరలించడంతో జాతర మొదలైంది. అడెల్లి, సారంగాపూర్, కౌట్ల(బి), జామ్, ధని, మలక్చించోలి, బీరవెల్లి, వంజర్, ప్యారమూర్ తదితర గ్రామాల భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, ఇన్చార్జి ఈవో రమేశ్ ఆధ్వర్యంలో ఆభరణాలు మూటకట్టారు. ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణల తర్వాత ఆభరణాలు, మూలవిరాట్కు పూజలు నిర్వహించారు. సేవదారులు తమ తలపై ఆభరణాలు ధరించి కాలినడకన గోదావరి నదికి పయనం కాగా, భక్తులు వెంట వెళ్లారు. తొలుత ఆలయంలో ప్రారంభమైన ఆభరణాల ఊరేగింపు సారంగాపూర్ మండలంలోని అడెల్లి, సారంగాపూర్, యాకర్పెల్లి, వంజర్, ప్యారమూర్, గ్రామాల మీదుగా దిలావర్పూర్ మండలంలోని కదిలి, మాటేగాం, దిలావర్పూర్, కంజర్, సాంగ్వీ గ్రామాల గుండా గోదావరి నది తీరానికి రాత్రివరకు చేరుకోనున్నాయి.

మంగళహారతులతో స్వాగతం..

అమ్మవారి ఆభరణాలు గ్రామాల గుండా ఊరేగింపుగా వెళ్తుండటంతో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. గంగపుత్రులు ఆనవాయితీ ప్రకారం..తమ పనిముట్లయిన వలలతో గొడుగుపట్టి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. ఆభరణాల భద్రత



గోదావరి నదికి తరలివెళ్తున్న భక్తులు

కోసం నిర్మల్రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరిగి మళ్లీ ఆదివారం ఉదయం నగలశుద్ధి, పవిత్ర గోదావరి నదిలోని నీటితో జలాభిషేకం అనంతరం సాయంత్రానికి ఆలయానికి చేరుకోవడంతో జాతర ముగియనుంది.

గడముంతల్లో గంగాజలాలు

అమ్మవారి ఆభరణాల వెంట గోదావరినదికి బయల్దేరి వెళ్లిన భక్తులు గడముంతల్లో గంగానది జలాలను వెంట తీసుకువస్తారు. తొలుత గడముంతల్లో తీసుకువచ్చిన నదీజలాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణల అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేస్తారు. ఆ నీటిని ఇళ్లలో, పంట పొలాల్లో చల్లితే పాడి పంటలు, పిల్లాపాపలు చల్లగా ఉంటాయని వారి నమ్మకం. గ్రామాల్లో అమ్మవారికి భక్తులు సమర్పించే బంగారం(పసుపు)ను తమవెంట తీసుకువచ్చి ఇళ్లలో పూజలు చేయడం ఆనవాయితీ. నుదుటన పసుపు పెట్టుకుంటే మంచి జరుగుతుందని వారి విశ్వాసం.

జాతర ఏర్పాట్ల పర్యవేక్షణ

సుమారు లక్షకుపైగా భక్తులు తరలిరానున్నారు. ఇన్చార్జి ఈవో రమేశ్ ఎస్సై శ్రీకాంత్ జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం, రోడ్లు బాగుచేయించడం తదితర పనులు దగ్గరుండి పూర్తి చేయించారు. ఈ ఏడాది త్వరగా అమ్మవారి ఆభరణాలను ఆలయానికి చేర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. సాంగ్వీ గ్రామం భక్తజన సంద్రమైంది. శనివారం రాత్రి అమ్మవారి ఆభరణాలు గ్రామానికి చేరుకున్నాయి. గోదావరి నది వద్ద ఆభరణాలకు శుద్ధి తర్వాత భక్తులు పూజలు చేశారు.

బందోబస్తుపై దృష్టిపెట్టాలి

- ఎస్పీ జానకీ షర్మిల

దిలావర్పూర్: అడెల్లి పోచమ్మ (గంగనీళ్ల) జాతర నేపథ్యంలో పోలీసులు బందోబస్తుపై దృష్టిపెట్టాలని ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. శనివారం సాంగ్వి గ్రామంలోని పోచమ్మ, అన్నపూర్ణ దేవి ఆలయంలో ఆమె పూజలు చేశారు. గోదావరినది తీరాన్ని పరిశీలించి పోలీసులతో సమావేశమై పలు సూచనలు అందజేశారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఆభరణాలు అడెల్లి ఆలయానికి తీసుకువెళ్లే గ్రామాలపై బందోబస్తుపై దృష్టి పెట్టాలన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీతోపాటు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణలను సన్మానించారు. దిలావర్పూర్ ఎస్సై ఎల్.సందీప్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



గోదావరి నది తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

సింగరేణిలో రాజకీయ జోక్యం

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో గతంలో ఎన్నడూ లేనంతగా రాజకీయం జోక్యం పెరిగిందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఆర్కే 6 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్లో కార్మికులతో మాట్లాడారు. సంస్థ కార్యకలాపాల్లో, ఆర్థిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని తెలిపారు. కార్మికులకు రావాల్సిన లాభాల వాటలో అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రప్రభుత్వం, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలు కలిసి కార్మికులకు అన్యాయం చేశాయన్నారు. రూ.4701 కోట్ల నుంచి 33 శాతం లాభాల వాటా రూ.1551 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.976 కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. వాస్తవ లాభాల నుంచి కాకుండా పెట్టుబడి పేరుతో లాభాల్లో కోతపెట్టి కార్మికులకు నష్టం చేసిందన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈ వైఖరికి నిరసనగా ఆదివారం గోదావరిఖనిలో చౌరస్తాలో టీబీజీకేఎస్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర కమిటీ నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్రెడ్డి, ముత్యాల రమేశ్, డివిజన్ నాయకులు గొర్ల సంతోష్, మహిపాల్రెడ్డి, పానుగంటి తిరుపతి, ఉత్తేజిరెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

బాసరలో సాంస్కృతిక కార్యక్రమాలు



ఆలయంలో వీణ వాయిస్తున్న నిర్వాహకులు

బాసర: బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహిస్తున్న శారదీయ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్కు చెందిన సప్తస్వరాలు ఇనిస్టిట్యూట్ మృదంగం బృందం నిర్వాహకులు మల్లికార్జున, లక్ష్మీపద్మావతి, సుచిత్ర, ఉమ బృందం శనివారం వీణ వాయిద్య కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న జగదీష్ మహరాజ్



అమ్మవారిని దర్శించుకున్న జగదీష్ మహరాజ్

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా గాడిపుర జగదీష్మహరాజ్ శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్పాటక్ అమ్మవారి హారతినిచ్చి, తీర్థప్రసాదాలు అందజేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు జగదీష్మహరాజ్, దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాదం అందజేస్తారు.

అమ్మవారి దయ ఉండాలి

- ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, సూర్యనారాయణ గుప్తా

ఆదిలాబాద్: జగదాంబ అమ్మవారి దయ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆదిలాబాద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, సూర్య నారాయణ గుప్తా అన్నారు. మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కేలాపూర్ జగదాంబ దేవి ఆలయానికి చేపట్టిన భక్తుల పాదయాత్రను జిల్లా కేంద్రంలోని శ్రీరాణి సతీజీ ఆలయం వద్ద శనివారం ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా నుంచి ఏటా వందలాది భక్తులు కేలాపూర్ ఆలయానికి వెళ్తుంటారన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఇందులో జగదాంబదేవి భక్తమండలి, బీజేపీ నాయకులు, భక్తులు తదితరులున్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

స్ప్రే బాటిళ్లు పేలి కానిస్టేబుల్కు గాయాలు



గాయాలపాలైన సురేశ్

తాంసి: స్ప్రే బాటిళ్లు పేలి ఓ కానిస్టేబుల్కు తీవ్ర గాయాలైన సంఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం పోలీసుస్టేషన్ ఆవరణ శుభ్రం చేసి చెత్తకు నిప్పుపెట్టారు. ఈ క్రమంలో అందులో ఉన్న స్ప్రే బాటిళ్లు ఒకసారిగా పేలడంతో పక్కనే ఉన్న కానిస్టేబుల్ సురేశ్కు తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. బాటిళ్లలో ఉన్న గ్యాస్ ప్రభావానికి చేతి చర్మం ఊడిపోయింది. వెంటనే గాయపడిన కానిస్టేబుల్ను ఎస్సై శివరాం, సిబ్బందితో కలిసి వాహనంలో రిమ్స్కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

కారు బోల్తా..ముగ్గురికి..



బోల్తాపడిన కారు

గుడిహత్నూర్: మండలంలోని జాతీయరహదారి డొంగర్గావ్ సమీపంలో శనివారం సాయంత్రం కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఇంద్రవెల్లి మండలానికి చెందిన పృథ్వీరాజ్, అక్షయ్, కాంబ్లే కిరణ్లు గుడిహత్నూర్ నుంచి హైదరబాద్కు కారులో వెళ్తున్నారు. డొంగ్రగావ్ సమీపంలో కారు వెనుక టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు గాయపడిన వారిని అంబులెన్స్లో ఆదిలాబాద్ రిమ్స్కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..





గాయపడ్డ యోగేష్, దీపిక

ముధోల్: మండల కేంద్రంలోని బసవా గార్డెన్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన యోగేష్ తన భార్య దీపికతో భైంసా వైపు నుంచి బాసరకు బైక్పై వెళ్తున్నాడు. ముధోల్ మండలం చించాలకు చెందిన రాకేశ్, కుభీర్ మండలానికి చెందిన సాయిప్రసాద్ కలిసి బైక్పై నిజామాబాద్కు వస్తున్నారు. మార్గమధ్యలో యోగేష్ దీపిక వెళ్తున్న బైక్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యోగేష్కు తీవ్రంగా, దీపికకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆటోలో ఆస్పత్రికి, అక్కడి నుంచి భైంసాకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి పంపించారు. కాగా, ఎస్సై సాయికిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

కడెం: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణసాగర్రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని కన్నాపూర్ పంచాయతీ పరిధిలోని వకీల్నగర్ గ్రామానికి చెందిన తొడసం శంకర్(25) గత కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈనెల 4న రాత్రి కుటుంబీకులు నిద్రించిన సమయంలో ఇంటి ఎదుట పందిరి దూలానికి ఉరేసుకున్నాడు. తండ్రి లస్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన వృద్ధుడు..

కౌటాల: జీవితంపై విరక్తితో వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడాడు. కౌటాల ఎస్సై ఎస్.మధుకర్ కథనం ప్రకారం.. కౌటాల పంచాయతీ పరిధిలోని కోయగూడ గ్రామానికి చెందిన గుర్లె పోచయ్య (75) గత కొన్నిరోజులుగా వృద్ధాప్యంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అలాగే మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 2న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు కిషన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు మృతి



ప్రశాంత్ (ఫైల్)

దహెగాం: బైక్ అదుపుతప్పి గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మొర్లె ప్రశాంత్(22) ఈనెల 2న పత్తి చేసుకు క్రిమిసంహారక మందులు పిచికారి చేయడానికి బైక్పై వెళ్లాడు. హత్తిని సమీపంలో అదుపు తప్పి కిందపడిపోయాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రశాంత్ను అంబులెన్సులో దహెగాం పీహెచ్సీకి, అటు నుంచి బెల్లంపల్లి, మంచిర్యాల ఆసుపత్రికి పంపించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తండ్రి నారాయణ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మట్కా నిర్వాహకుడు అరెస్టు

ఆదిలాబాద్టౌన్: మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు వన్టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని పంజాబ్ చౌక్లో శనివారం నిర్వహించిన వాహనాలు తనిఖీలో భాగంగా కొత్త కుమ్మరివాడకు చెందిన కోట పురుషోత్తంను సెల్ఫోన్లో ఆన్లైన్ ద్వారా మట్కా ఆడుతున్నట్లు గుర్తించారు. ఆయనను విచారించగా మట్కా ఆడేందుకు షేక్ నజీం, అజీంలు డబ్బులు పంపినట్లు తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేసి పురుషోత్తంను అరెస్టు చేయగా, ఇద్దరికోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిర్వాహకుడి నుంచి మట్కా చిట్టీలు, సెల్ఫోన్తోపాటు రూ.8770 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

గేదెల దొంగల పట్టివేత

ఆదిలాబాద్రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలో గేదెలను ఎత్తుకెళ్లిన ముగ్గురు దొంగలను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని రాంనగర్కు చెందిన షేక్ ఇంతియాజ్, మోయిూన్ ఖాన్, న్యూహౌజింగ్ బోర్డుకు చెందిన ఇంతియాజ్ ఖాన్లు ఇటీవల 5 గేదెలను ఎత్తుకెళ్లారు. మావల పరిసర ప్రాంతాల్లో గేదెలను మేపుతుండగా పట్టుకున్నట్లు వివరించారు. ముగ్గురు నుంచి రెండు గేదెలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన గేదెలను గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించినట్లు విచారణలో తెలిపారని ఎస్సై పేర్కొన్నారు. దస్నాపూర్కు చెందిన ఐలయ్య, రాంనగర్కు చెందిన కె.శ్రీనివాస్ల గేదెలుగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు.

కొండచిలువ కలకలం



కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియం సమీపంలో శనివారం కొండచిలువ కలకలం రేపింది. కొండచిలువ చెట్టుకు చుట్టుకుని ఉండటాన్ని స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలేశారు. కొండచిలువను చూసేందుకు స్థానికులు తరలివచ్చారు.

అక్రమ కట్టడాల కూల్చివేతపై ఆందోళన



ఆందోళనకారులకు నచ్చజెప్పుతున్న పోలీసులు

- మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట గిరిజనేతరుల రాస్తారోకో
- రెండు గంటల పాటు ట్రాఫిక్ జాం
- సబ్ కలెక్టర్తో చర్చలు.. ఆందోళన విరమణ

ఇంద్రవెల్లి: కలెక్టర్ ఆదేశాలతో మండలకేంద్రంలో అక్రమ కట్టడాలను అధికారులు జేసీబీతో కూల్చివేశారు. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య శనివారం తెల్లవారుజాము 4 గంటలకు కూల్చివేతలు చేపట్టారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట నాలా కబ్జా చేసి నిర్మించిన సోన్కాంబ్లే దేవిదాస్ ఇల్లు, అందునాయక్తండా చౌక్ సమీపంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న సాబ్లే శ్యామ్రావ్ చెందిన నాలుగు పిల్లర్లను జేసీబీతో కూల్చివేశారు. అధికారులు తీరు నిరసిస్తూ ఉదయం 9 గంటలకు గిరిజనేతరులు ఆందోళనకు దిగారు. మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేపట్టి బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. జిల్లా కలెక్టర్ రావాలని పట్టుబట్టారు. సుమారు రెండు గంటల రాస్తారోకోతో ట్రాఫిక్కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్గౌడ్, సీఐ మొగిలి, ఎస్సై సునీల్ అక్కడికి చేరుకున్నారు. సబ్ కలెక్టర్ వస్తున్నారని రాస్తారోకో విరమించాలని డీఎస్పీ కోరగా, వారు శాంతించలేదు. ఈ సందర్భంగా గిరిజనేతర పెద్దలు మాట్లాడుతూ ఆదివాసీలతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. గిరిజనులతో కలిసి జీవనం సాగిస్తున్న పేదలకు చెందిన గిరిజనేతరుల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేసిందన్నారు. ఇళ్ల కూల్చివేత ముందు తమపై బుల్డోజర్లు ఎక్కించాలన్నారు. కాగా, సబ్ కలెక్టర్ అక్కడికి చేరుకుని వారితో చర్చించడంతో ఆందోళన విరమించారు. డబ్బులు తీసుకుని అనుమతి ఇచ్చిన పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పట్టా భూముల్లో నిర్మించిన ఇళ్ల జోలికి వెళ్లలేదని, ప్రభుత్వ భూములు, నాలాపై కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన కట్టడాలకు నోటీసులు ఇచ్చాకే కూల్చివేశామన్నారు. అనుమతి లేకుండా అక్రమ కట్టడాలు చేపడితే కూల్చివేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇంద్రవెల్లి పటేల్ మారుతి డోంగ్రె, గిరిజనేతర పెద్దలు సంజీవ్ లహనే, కేశావ్ ముస్లే, బాబు ముండే, తహరే గణేశ్, సంతోష్ జైస్వాల్, జవహర్లాల్ తదితరులు ఉన్నారు.



గిరిజనేతర పెద్దలతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు చాంపియన్

ఆసిఫాబాద్రూరల్: రాష్ట్రస్థాయి హ్యాండ్బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు చాంపియన్గా నిలిచిందని ఎస్జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. నారాయణపేట జిల్లాలో ఈనెల 3 నుంచి 5 వరకు నిర్వహించిన అండర్-17 బాల,బాలికలకు నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభకనబర్చి చాంపియన్ కైవసం చేసుకుందని పేర్కొన్నారు. సెమీఫైనల్లో వరంగల్ జట్టు, ఫైనల్లో కరీంనగర్ జట్టుపై విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభకనబర్చిన ఉమ్మడి ఆదిలాబాద్ జట్టులో ఆసిఫాబాద్ ఆదర్శ క్రీడ పాఠశాల విద్యార్థినులు సత్యభామ, నందిని, అంజలి, కవిత, శిరీష, అనూష, జ్యోతి, కోచ్ అరవింద్ను డీఎస్వో మీనారెడ్డి, హ్యాండ్బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ అభినందించారు. కోచ్ రాకేశ్, విశాల్, సాయి పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా హ్యాండ్బాల్ జట్టు